# పిల్లలు ఒంటరిగా ఉంటున్నారా?

ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు పోయాయి. ప్రతి ఇంట్లోనూ కుటుంబ సభ్యుల సంఖ్య తగ్గిపోతోంది. ఈ స్థితిలో ఇంట్లో తల్లిదండ్రులు, ఒకరో, ఇద్దరో పిల్లలే ఉంటున్నారు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగ రీత్యా బయటకు వెళుతుంటారు. అటువంటి పరిస్థితుల్లో ఏదో ఒకరోజు ఇంట్లో పిల్లలు ఒక్కరే వుండటం అనివార్య మవుతుంది. ఇంట్లో పిల్లల్ని ఒక్కరినే వది

**చిట్కాలు**

లేముందు వారికి కొన్ని జాగ్రత్తలు చెప్పడం అవసరం.

* తలుపులకు లోపల బోల్ట్ ఎలా వేసుకోవాలో, ఎవరైనా డోర్‌బెల్ కొట్టినప్పుడు తలుపు ఎలా తెరిచి చూడాలో వివరించాలి.

* కిచెన్‌లో గాస్‌స్టౌ, మిక్సీ మొదలైన వాటి జోలికి వెళ్ళకుండా వుండేలా చూడాలి. లేకపోతే కిచెన్ లాక్‌చేసే అవకాశం వుంటే లాక్‌చేయడం మంచిది.

* పిల్లలకు అందుబాటులో వుంటుంది గదా అని తాళం చెవులను అన్నింటినీ గుర్తుగా ఎప్పుడూ ఒకేచోట పెట్టకూడదు. అలాచేయడంకన్నా ఒక తాళం చెవిని వారికి ఇచ్చి దాన్ని ఎలా జాగ్రత్తగా వుంచుకోవాలో నేర్పాలి.

* తినుబండారాలను పైన అలమారుల్లో పెట్టకుండా పిల్లలకు అందుబాటులో వుండేలా పెట్టాలి.

* అత్యవసర సమయంలో ఏ టెలిఫోన్ నెంబరుకు ఫోన్ చేయాలో వివరంగా చెప్పాలి. అవసరానికి ఆదుకునే దగ్గరలో వుండే స్నేహితులు, బంధువుల నెంబర్లను అన్నింటినీ ఒకచోట ప్రత్యేకంగా పిల్లలకు వెంటనే కనిపించేలా రాసివుంచాలి.

* ఇంట్లో పిల్లలు ఒంటరిగా వున్నారన్న విషయాన్ని ప్రచారం చేయకూడదు. కొత్త వారెవరైనా ఇంటికి ఫోన్ చేసినా పిల్లలు ఒక్కరే ఇంట్లో వున్నారన్న విషయాన్ని తెలియచేయవద్దని పిల్లలకు చెప్పాలి.

* తలుపులు తీయడం, కిటికీలు మూయడం వంటి పనులు ముందుగానే నేర్పించి, వారికి బాగా అలవాటైన తర్వాతనే పిల్లల్ని ఒంటరిగా వదలాలి.

* ఇంటికి వచ్చాక ఒంటరిగా వున్నప్పుడు పిల్లల్లో కలిగే భావాలను, భయాలను అడిగి తెలుసుకొని అవి పోగొట్టే ప్రయత్నం చేయాలి.

# "...ఎలుకకి ప్రాణ సంకటం"

**ఎల్.ఆర్.స్వామి**

హఠాత్తుగా మెలుకువ వచ్చింది, అతనికి. కళ్ళు తెరవటానికి ప్రయత్నించాడు; కాని కనురెప్పలు వీడలేదు. ఒళ్ళంతా నొప్పిగా అనిపించింది. కాళ్ళు చేతులు కదపలేకపోయాడు. ఎక్కడ వున్నాడని అర్థంకాలేదు.

ఏవేవో మాటలు వినబడ్డాయి. కొందరి ఏడుపులు- అరుపులు- ఏదో గొడవ జరుగుతుందని గ్రహించాడు. బలవంతంగా కనురెప్పలు విప్పిచూసాడు. అప్పుడు తెలుసుకున్నాడు, రోడ్డుమీద పడివున్నట్టు. జనం పరుగెత్తుతున్నారు- ఏదో వాసన- ఎగిరే పొగ- అలుముకునే చీకటి-

అక్కడకి ఎలా వచ్చాడని ఆలోచించాడు, అతడు సుమారు నాలుగు గంటల టైంలో రోడ్డు దాటటం గుర్తుంది.

చెయ్యి రోడ్డు మీద ఆన్చి లేవటానికి ప్రయత్నించాడు, కాని కుదరలేదు. కంగారుగా చూసాడు. అప్పుడు కనబడింది, అతనికి- కుడికాలి మోకాళ్ళ క్రిందభాగం ఊడి వేలాడుతున్నట్టు. రోడ్డు మీద రక్తం నదిలా పారుతోంది. అక్కడక్కడ మానవ మాంసం ముద్దలు పడివున్న రోడ్డు సాయం సంధ్యవేళటి పశ్చిమాంబరాన్ని గుర్తు చేసింది.

"రక్షించండి, నన్ను రక్షించండి" కంగారుగా గట్టి అరిచాడు, అతడు. "హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి".

ఎదురుగా కనబడింది, హాస్పిటల్. వైద్యం కోసం ఆ హాస్పిటల్‌లోనే చేర్చాడు, రెండేళ్ళ పాపని. పాప కోసం మందులు కొని రోడ్డు దాటుతూ వుండగా వచ్చింది, ఆ శబ్దం. ఆ తరువాత...

జేబు తడిమిచూసాడు. మందులు భద్రంగానే వున్నాయి.

ముందుకు సాగటానికి ప్రయత్నించాడు. ఒళ్ళు కదలలేదు.

**చిన్నకథ**



"నన్ను రక్షించండి. మళ్ళీ అరిచాడు "హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి".

ఎవరూ అతన్ని పట్టించుకోలేదు. కొందరైతే అతన్ని తొక్కుతూ పరిగెత్తారు.

నెత్తురు తోడుక్కున్న నిమిషాలు అతన్ని దాటి వెళ్ళాయి.

అరిచి అరిచి పూర్తిగా అలసిపోయాడు, అతడు. కళ్ళు మూతలు పడుతున్నా, ఆశగా, అటూ, ఇటూ చూసాడు. మెల్లగా వచ్చి అతనివద్ద ఆగారు ఇద్దరు. అతని మెడ మీద, వీపు మీద చెయ్యివేసి లేపటానికి ప్రయత్నించాడు, ఒకడు. ఆశగా అతనివైపు చూసాడు. చమురు చుక్కలు అందిన కొడిగట్టే దీపంలా వెలిగింది అతని మోము.

"నన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి" అతడు సన్నటి గొంతుతో పలికాడు.

ఆ మాటలు పట్టించుకోకుండా, ముందుకు సాగాడు రెండో అతడు.

"సీను బాగా రావాలిరా" మెడ మీద చెయ్యి వేసి తల యెత్తి పట్టుకున్న వ్యక్తి అన్నాడు. "సీను అదిరిపోవాలి".

వీడియో కెమెరా కదిలింది.

"బాస్ మెచ్చుకోవాలిరా" బాస్ మెచ్చుకుంటే.... నీకు తెలుసుగా... మనకి..."

ఆ తరువాత మాటలు అతనికి వినబడలేదు. మెలుకువ రాని మైకంలోకి జారిపోయాడు, అతడు.